



అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -345 శుక్రవారం 24 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-


Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

## ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**హర్మూజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు**

**-నిర్బంధించినంత కాలం తెరిచేది లేదు : ఇరాన్**

**యుద్ధంతో పతనం దిశగా ఆర్థిక వ్యవస్థ**



**వాషింగ్టన్ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకా దళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు.**మిగతా 2లో...**

# సమ్మెలో విషాదం

## వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్‌గౌడ్**

**పరిస్థితి విషమం.. కార్మికుల్లో తీవ్ర ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కొనసాగిన సమ్మె**

**పోలీస్ భద్రత మధ్య 45శాతం బస్సులు రోడ్లపైకి..**

**నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో సమావేశం**

**రోజుకో తరహాలో నిరసన కార్యక్రమాలు: ఆర్టీసీ జేఏసీ**

**తొందరపాటు వద్దు.. ప్రాణం పోతే తిరిగిరాదు!**

**ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నంపై సీఎం రేవంత్**

**సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నామని వ్యాఖ్య**

**చర్చలు సరిగా జరపలేదని అధికారులపై అసహనం**

**హైదరాబాద్ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ..



వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేశారు. బస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోలు పోసుకుని, నిప్పంటించుకున్నారు. ప్రయాణికులు,**మిగతా 2లో...**

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

**రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ**

**పార్టీ సంస్థాగత నిర్మాణంపైనా చర్చ**

**నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన**



## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** అసెంబ్లీ ఎన్నికల తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ. 25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని వస్తున్నవార్తలను ప్రభుత్వం గురువారం కొట్టివేసింది. అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 29 నాటికి పశ్చిమబెంగాల్ **మిగతా 2లో...**



## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

**మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం**

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం**

**నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ**



# పల్లెల్లో పవన్ మార్క్

**జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం**

- **స్వయంప్రతిపత్తి, స్వావలంబన దిశగా అడుగులు**
- **ఫలితాన్నిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు**
- **గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం**
- **రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లోనూ నంబర్ వన్ స్థానం**

**(అమరావతిఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలిడ స్వయం ప్రతిపత్తి, స్వావలంబనతో ముందుకు సాగాలిడ పల్లెలు జాతీయ సమగ్రత, సుస్థిరతకు మూల కేంద్రాలు కావాలిడ ఇవీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు నిర్దేశించుకున్న లక్ష్యాలు. గత ప్రభుత్వ విధానాలతో పూర్తిగా నిర్వీర్యం అయిన పంచాయతీరాజ్ వ్యవస్థకు పునరుజ్జీవం పోస్తూ,**మిగతా 2లో...**





## పెట్టుబడులు పెట్టండి

**సింగపూర్ పారిశ్రామికవేత్తలకు మంత్రుల ఆహ్వానం**

**మూడో రోజు పర్యటనలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ అంశాలపై అధ్యయనం**

**ఎస్‌బీఎఫ్ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం**

**(అమరావతిఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రుల బృందం మూడో రోజు గురువారం పలు కీలక అంశాలపై అధ్యయనం చేసింది. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్)**మిగతా 2లో...**

# పోలింగ్ రికార్డు

**తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్**

**బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత**

**ఓటేసిన ప్రముఖులు, సినీతారలు**



**న్యూఢిల్లీ ఏఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** పశ్చిమ బెంగాల్ తొలివిడత, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.78 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశ స్వాతంత్ర్యం అనంతరం నమోదైన అన్ని ఎన్నికల్లో కంటే అత్యధికంగా తమిళనాడులో 84.69 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 8.39 గంటలకు పోలింగ్ వివరాలను ఇసి విడుదల చేసింది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించారు. సాయంత్రం 6 గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు.**మిగతా 2లో...**

# నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై ముందుకు

**వెంటనే సీబీఐ విచారణ కోరాలని నిర్ణయం**

**పెన్షనర్లు, ఉద్యోగుల బకాయిలపై 100 రోజుల్లో ప్రణాళిక**

**50 శాతం జీతం విరాళంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**రూ.700 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో గచ్చిబౌలి స్టేడియం ఆధునీకరణ**

**నామినేటెడ్ పద్ధతిలో పీఏసీఎస్ ఛైర్మన్ల నియామకం**

**:క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి**

**హైదరాబాద్ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** న్యాయ నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీ కార్మికుల సమస్య లు,




కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు తదితర అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం గురువారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సమావేశమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం ముగి సిన అనంతరం క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. హైకోర్టు పూర్తి తీర్పు పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా.. లేదా కమిషన్ గడువు పొడగించాలా అనేది,**మిగతా 2లో...**

# పోలింగ్ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కు వినియోగించు కున్నారు. ప్రముఖ సినీ నటులు రజనీకాంత్, ఎంఎన్ఎం అధినేత, నటులు కమలహాసన్, టివికె అధినేత విజరు తదితరులు ఓటు వేశారు.

**పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు**

పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ముర్షిదాబాద్‌లో టిఎంసి కార్యకర్తలకు, ఎయుజెపి వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది. సిలిగురిలో టిఎంసి, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్టు సమాచారం. కుమార్‌గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొలగించారని బిజెపి అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపించారు. తనపై దాడి జరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు.

**తమిళనాడులో ప్రశాంతం**

తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలువురు ప్రముఖులు, ప్రముఖ రాజకీయ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

లైవ్ వెబ్ కాస్టింగ్‌లో పరిశీలన : ఇసి

లైవ్ వెబ్‌కాస్టింగ్‌లో రెండు రాష్ట్రాల్లోని అన్ని పోలింగ్ బూత్‌లను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ ఎస్ఎస్ సంధు, డాక్టర్ వివేక్ జోషి పరిశీలించినట్లు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



**ఉప ఎన్నికల్లో**

గుజరాత్‌లోని ఉమ్రెత్ 3 ఉప ఎన్నికల్లో 59.03, మహారాష్ట్రలోని బారామతి -201లో 57.48, రాహురి -223లో 55.31 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇసి ప్రకటించింది.

# నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై ముందుకు

**మొదటిపేజీ తరువాయి**

వారిచ్చే సలహాలు సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీవో జారీ చేసి తొమ్మిది నెలలైనా దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలియజేశారన్నారు. వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం తరపున మరోసారి సీబీఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు.కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ జ్యుడీషియల్ కమిషన్ నియామకంతో పాటు నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమనీ, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడిందన్నారు. పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టిందని తెలిపారు. ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవనీ, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు ఇలా ఉంటే బీఆర్ఎస్ శ్రేణులు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలన్నారు. వారి చేసిన తప్పిదం వల్ల కాళేశ్వరం పేరిట ఏటా రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్ల అదనపు భారం పడుతోందన్నారు. కేంద్ర మంత్రి ఎన్డీఎస్ రిపోర్ట్ చదువుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆహ్వానం మేరకు ఎన్డీఎస్ చైర్మెన్ అనిల్ జైన్ కాళేశ్వరం క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చారనే విషయం సంజరు గుర్తుంచుకోవాలని తెలిపారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ బకాయిలు గత సర్కార్ హయాం నుంచి కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.




రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని ముందుకొచ్చారని వివరించారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరిపి, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు(పీఏసీఎస్) నామినేటెడ్ పద్ధతిన పాలకవర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 64 ఎకరాల్లో 21 రకాల క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడంతో పాటు అవుట్ డోర్ స్టేడియం సామర్థ్యం 20 వేల నుంచి 50 వేలకు పెంచాలని నిర్ణయించిందని వివరించారు. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్‌కు ఇచ్చి..వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని నిర్ణయించామన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూసేకరణ పూర్తి చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.ప్రాజెక్ట్‌కు దాదాపు 2,427 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటివరకు 1020 ఎకరాలు సేకరించామన్నారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిసరాల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు కేటాయిస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని మంత్రులు వివరించారు.

# సమ్మెలో విషాదం

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులు వెంటనే మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. శంకర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నల్లగొండ, ఖమ్మంలలో మరో ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వరుస పరిణామాలతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను నియమించడం, పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడంతో గురువారం 45శాతం వరకు బస్సులు నడిచాయి. కాగా, రెండో రోజు సమ్మెలో ఊహించని పరిణామాలు చోటు చేసుకోవడంతో సమ్మె తదుపరి కార్యరూపం ఎలా ఉంటుందోననే అంశంపై నిఘా వర్గాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనాల దోపిడీ కొనసాగింది. రెండింతలకుపైగానే చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళన..**

రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా ఆర్టీసీ జేఏసీ సమ్మె కొనసాగింది. కార్మికులు విధులు బహిష్కరించి డిపోల ముందు, బస్‌స్టేషన్లలో నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. బస్సులు బయటికి రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. పలుచోట్ల సమ్మెలో పాల్గొంటున్న ఆర్టీసీ కార్మికులకు టెంట్లు, సామగ్రి సరఫరా చేయవద్దంటూ స్థానిక పోలీస్ స్టేషన్ల నుంచి టెంట్‌హౌస్‌ల నిర్వాహకులకు ఆదేశాలు వెళ్లాయి. పలుచోట్ల వేసిన టెంట్లను కూడా తొలగించారు. దీనితో ఆర్టీసీ కార్మికులు ఎండలోనే ఆందోళనలు కొనసాగించారు. తమ సమ్మెకు అడ్డుపడొద్దని కోరుతూ కొన్నిచోట్ల కార్మికులు పోలీసు అధికారుల కాళ్లు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఒక తాత్కాలిక డ్రైవర్ బస్సును డిపో నుంచి బయటికి తీస్తుండగా.. ఇద్దరు మహిళా కండక్టర్లు మంజుల, సునీత బస్సుపై కారం చల్లారు. దీనిపై డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



**45శాతం బస్సులు రోడ్లపైకి!**

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముమ్మరం చేశాయి. డిపోలు, బస్టాండ్ల వద్ద పోలీసులను మోహరించారు. బస్సుల్లోనూ పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లను నియమించారు. ఈ క్రమంలో గురువారం సుమారు 45శాతం బస్సులు రోడ్డెక్కాయని అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు 98శాతం, అద్దె బస్సులు 95శాతం, ఆర్టీసీ బస్సులు 15శాతం నడిచాయని తెలిపారు. నారాయణపేట్, సిద్దిపేటలలో మాత్రం బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఇక సమ్మె కొనసాగుతున్న విషయం తెలిసిన జనం చాలా వరకు ప్రయాణాలు మానుకున్నారు. అత్యవసరమైన వారు, ముందే ఇతర ప్రాంతాలకు వెళ్లి చిక్కుకున్నవారు మాత్రం బస్టాండ్లకు వచ్చారు. దీంతో ప్రధాన బస్టాండ్లు బోసిపోయి కనిపించాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో బస్సుల్లో కండక్టర్లు లేకపోవడంతో మహిళలతోపాటు పురుషులూ ఉచితంగానే ప్రయాణించారు.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

**కోల్‌కతాఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను ప్రోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**మొదటిపేజీ తరువాయి**

'హర్మూజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతి తోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోందన్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్భందం కోనసాగుతుందని తెలిపారు

అయితే కొద్ది రోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాని ట్రంప్ నుండే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్భందం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్ముజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం..**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం అవుతుందని ఎస్‌పి గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ గురువారం నివేధించింది. ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయని, సేవా రంగంలో కూడా కార్యకలాపాలు మందగించాయని ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఇంధన సరఫరాలకు ఎదురైన అత్యంత తీవ్రమైన ఆటంకాలను అధిక భాగం తట్టుకున్నప్పటికీ, దాదాపు రెండు నెలలనుండి కొనసాగుతున్న యుద్ధంతో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, ఆహార సరఫరాలపై ప్రభావం, ఆర్థిక వృద్ధి మందగించడానికి కారణాలు నివేదిక విశ్లేషించింది. యూరో జోన్‌లోని 21 దేశాలు అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఉన్నాయని, దీనికి సంబంధించిన అబివృద్ధి సూచిక మార్చిలో 50.7 శాతం నుండి ఏప్రిల్‌లో 48.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.

# పల్లెల్లో పవన్ మార్క్

**మొదటిపేజీ తరువాయి**

కీలక సంస్కరణలతో పాటు పలు రకాల పథకాలకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. జగన్ ఐదేళ్ల పాలనలో కేంద్ర అధికారులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను లెక్కచేసేవారు కాదు. నిధులు విడుదల చేసేవారు కాదు. అయితే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ శాఖ పగ్గాలు చేపట్టాక.. సమర్థులైన అధికారులు, సిబ్బందితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను రాబడుతున్నారు. సుమారు పది అంశాల్లో ఈ శాఖ ఇప్పుడు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 2025- 26 సంవత్సరానికి సంబంధించి రెండు కేటగిరీల కింద రాష్ట్రానికి 5 అవార్డులు దక్కాయి. స్థానికంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేస్తున్న 5 పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్(లను కేంద్రం ప్రకటించింది. మహిళా స్నేహపూర్వక పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామానికి మొదటి ర్యాంకు.. పేదరిక నిర్మూలన-జీవనోపాధి పెంపు కేటగిరీలో కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లి గ్రామ పంచాయతీకి రెండో ర్యాంకు.. మౌలిక వసతుల స్వీయ అభివృద్ధి కేటగిరీ కింద ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమల గ్రామ పంచాయతీకి మూడో ర్యాంకు.. అదే విధంగా మండల స్థాయిలో చిత్తూరు జిల్లా కుప్పం మండలానికి అవార్డు దక్కింది. ఈ పంచాయతీలకు రూ.4.75 కోట్ల నగదు బహుమతి కూడా అందించనున్నట్లు కేంద్రం సమాచారం అందించింది.

# పెట్టుబడులు పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులతో సమావేశమైన మంత్రులు.. రాష్ట్రంలో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. మరోవైపు ఏపీలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ, స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం లక్ష్యంలో భాగంగా మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్‌లు పలు కీలక సంస్థలను సందర్శించారు. మొదట ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీని మంత్రులు సందర్శించారు. అక్కడి పోర్టు కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 2040 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద, పూర్తిస్థాయి ఆటోమేటెడ్ టెర్మినల్‌గా అవతరించనున్న టువాస్ పోర్ట్ పనితీరు, అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత గురించి తెలుసుకున్నారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో కృత్రిమ మేధ, స్మార్ట్ వ్యవస్థలను అనుసంధానం చేయడం ద్వారా సమయాన్ని, ఖర్చును ఎలా ఆదా చేస్తున్నారో మంత్రుల బృందం అధ్యయనం చేసింది. సింగపూర్‌లో పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే ప్రభుత్వ సంస్థ జేటీసీ కార్పొరేషన్‌ను కూడా మంత్రులు సందర్శించారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి, ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం, పర్యావరణ అనుకూల గ్రీన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడంలో జేటీసీ కీలక పాత్ర పోషించింది. భూమి కొరత ఉన్న సింగపూర్‌లో చమురు నిల్వ కోసం భూగర్భంలో నిర్మించిన జురాంగ్ కేవర్న్ మంత్రుల బృందాన్ని ఆకర్షించింది. ఏపీలోని తీర ప్రాంతాల్లో ఇలాంటి వినూత్న స్టోరేజ్ పద్ధతులపై మంత్రులు చర్చించారు. నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యంతో చేపడుతున్న గ్రీన్ ప్రాజెక్టుల అమలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా, పర్యటనలో భాగంగా సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో మంత్రులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలను వివరించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకువస్తున్న కొత్త పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి తెలియజేశారు. రాజధాని అమరావతితో పాటు గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోతాయని, ఆ తరువాతనే ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్ల వంతున పెరిగిన దాని బట్టి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక వెల్లడించింది. అలాంటి నివేదికలు పౌరుల్లో భయాందోళనలు సృష్టించడానికే డిజైన్ చేశారని మంత్రిత్వశాఖ పేర్కొంది. వాస్తవానికి గత నాలుగేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేని దేశం భారత్ ఒకటేనని వెల్లడించింది. ప్రజలపై ధరాభారం పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిరంతరం అనేక చర్యలు తీసుకుంటున్నాయని వివరించింది.

# రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

**న్యూఢిల్లీఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది.

# గొల్లగూడెంలో ఘనంగా వివాహ వేడుక వధూవరులను ఆశీర్వదించిన వీరారెడ్డి



**తల్లాడ/, ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో కిష్టాపురం గ్రామ వాసులు కొరకప్పు వెంకటేశ్వర్లు రాధమ్మ కుమార్తె సువర్ణ, సుమంత్‌ల వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నూతన వధూవరులకు అతిథులు అక్షింతలు వేసి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వైరా మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల కాంగ్రెస్ నాయకులు కోడూరి రాము, కిష్టాపురం గ్రామ కాంగ్రెస్ యూత్ నాయకులు కోడూరి రాజేశ్వరావు, తేలూరి బాలకృష్ణ, విలాసాగరం తిరుపతి రావు, విలాసాగరం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు కోడూరి కృష్ణయ్య, విలాసాగరం రామకృష్ణ, వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, బొగ్గుల నర్సిరెడ్డి, బొగ్గుల కిరణ్ రెడ్డి, విలాసాగరం కోటేశ్వరరావు, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో జరిపారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

## డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తీవ్ర విమర్శలు



**నర్సంపేట,/ ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. కార్మికులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మికుల పక్షాన ఉంటామని ఎన్నికల సమయంలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించిన ఆయన, ప్రభుత్వం అసలు సమస్యలను పక్కన పెట్టి కేబినెట్ సమావేశాల పేరుతో కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ విషయంలో గతంలో కేసీఆర్ కూడా హామీలు ఇచ్చి అమలు చేయలేదని గుర్తుచేశారు. "కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒకే తీరుగా వ్యవహరిస్తున్నారు" అంటూ విమర్శించిన ఆయన, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత మరిచిపోయిందని దుయ్యబట్టారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లలో సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, పెండింగ్ వేతన సవరణ (పీఆర్సీ)ను వెంటనే అమలు చేయడం, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం ముఖ్యమైనవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, సీనియర్ నాయకులు గడ్డం ఆంజనేయులు, కుంభం కోమల్ రెడ్డి, మల్యాల వినయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు జూలూరి మనీష్ గౌడ్, కొంకేస విగ్నేష్ గౌడ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, ఆడెపు చందు, తప్పెట్ల సతీష్, చిలువేరు అన్వేష్, వేల్పుగొండ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ చేతులమీదుగా కఠిన సేవా పథకాన్ని అందుకున్న సీఐ రవీందర్.



**బయ్యారం/,ఏప్రిల్ 23.(జర్నలిస్ట్ వార్త)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను ప్రకటించిన కఠిన సేవా పథకానికి గార్ల బయ్యారం సీఐ లోడిగ రవీందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ డా. శబరీష్ చేతుల మీదుగా కఠిన సేవా పథకాన్ని గురువారం అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ సీఐ రవీందర్ ని ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ,నిబద్ధతతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందిస్తున్నందుకు సీఐ రవీందర్ ని ప్రశంసించారు. నేర నియంత్రణ,ప్రజల సమస్యల పరిష్కారం,శాంతి భద్రతల పరిరక్షణలో చూపుతున్న కృషి ప్రశంసనీయం అని కొనియాడారు. ఇకముందు కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిస్తూ ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ అండ

## సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం



**సత్తుపల్లి/ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సమ్మె స్థలానికి చేరుకుని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికులతో మాట్లాడిన ఆయన, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణలో భాగంగా 30 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.400 కోట్లు కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించి అద్దె బస్సులను రద్దు చేయాలని సూచించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, చర్చల ద్వారా త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ వ్యవస్థ బలంగా నడిచిందని, అప్పట్లో కార్మికులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రజా రవాణా వ్యవస్థ బలపడాలంటే కార్మికుల సంక్షేమం కీలకమని, వారి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

# రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విరాళం

## హర్షం వ్యక్తం చేసిన గౌడ సంఘం





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో జరగనున్న కల్యాణ మహోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ విషయంపై గౌడ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 26, 27, 28 తేదీలలో శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో గౌడ సంఘం నాయకులు భారీగా విరాళాలు సేకరించారు. ఈ క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించగా, ఆయన రూ.50,116 విరాళం అందజేస్తానని హామీ ఇచ్చారు.

గురువారం రోజున ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద గౌడ సంఘం నాయకులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి, మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య గౌడ్, గొడిశాల యాదగిరి గౌడ్, శనిగరపు వెంకటేష్, డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, అంబాల శ్రీకాంత్, జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, అర్జున్ గౌడ్, రమేష్ చారి, బుచ్చి రాములు గౌడ్, శ్రీపతి సదానందం, గౌడ సంఘం నాయకులు గొడిశాల కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షులు రవి, రాజేష్, సుమన్, విక్రమ్, కుమారస్వామి, శ్రీకాంత్, సురేష్, మహిపాల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజలకు చల్లని నీరు చలివేంద్రం ప్రారంభం






**తల్లాడ,/ ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తల్లాడ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ టీ. కరుణాకర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించే సేవా కార్యక్రమాలు అభినందనీయమని, సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరింత పెరగాలని పేర్కొన్నారు. నిర్వాహకులు దారెల్లి తిమోతి మాట్లాడుతూ, రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ మనోహర్ జేమ్స్ ఆర్థిక సహకారంతో రెండు జీవజల కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. సహకారం అందించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనాపురం ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు, టిపిసిసి తల్లాడ మండల అధ్యక్షులు కే. ఇజ్రాయేలు, సూర్యం, నారపోగు ప్రసాద్, రేగళ్ల శ్రీనివాసరావు, కాంపాటి రవి, దారెల్లి ఇందిరా, రావుల గోపయ్య గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ అధికారిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు.

## -ఎస్ఐ తిరుపతి.

**బయ్యారం/,ఏప్రిల్ 23.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలశీ రెడ్యాతండా గ్రామానికి చెందిన బానోత్ అక్షయ్ రవి రాథోడ్ (43) అనే వ్యక్తి అటవీ శాఖ అధికారిని ఫోన్ ద్వారా బెదిరించిన ఘటనలో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారం రోజుల క్రితం బయ్యారం ఎఫ్ఆర్ఓ సువర్చల రెడ్డికీ కాల్ చేసి ధర్మాపురం వద్ద టెంపుల్ నిర్మాణాన్ని ఆపవద్దని హెచ్చరించాడని,అలాగే వాట్సాప్ గ్రూపుల్లో అధికారులపై అసభ్యకర, బెదిరింపు సందేశాలు పోస్ట్ చేసినట్లుఫిర్యాదు అందగా కేసు నమోదు చేసి,హైదరాబాద్‌లో ఉన్న నిందుతుడిని గురువారం బయ్యారం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని,మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు బయ్యారం ఎస్ఐ కే.తిరుపతి తెలిపారు. ఇదేవిధంగా బయ్యారం మండలంలో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు,ఉద్యోగస్తులు,ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు,పోస్టులు పెట్టె వారిపై కూడా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని బయ్యారం ఎస్ఐ హెచ్చరించారు.

# ధర్మసాగర్‌లో ఖర్గే దిష్టిబొమ్మ దహనం- బీజేపీ నిరసన



**ధర్మసాగర్,/ హనుమకొండ బ్యూరోఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రధాని పట్ల అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శివప్రసాద్ రెడ్డి, జిల్లా నాయకులు గంకిడి వెంకట్ రెడ్డి, నాగవల్లి యుగేందర్, దుస్సా రాములు పాల్గొన్నారు. అలాగే మండల ఉపాధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంగారపు రమేష్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు గాజా శ్యాంసుందర్, ఓబీసీ మోర్చా నాయకుడు అనిరుద్‌తో పాటు మండల నాయకులు పులా శ్రీనివాస్, శ్రీరాములు విజయ్, మౌరె రాజేందర్, చింత రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం.





**బయ్యారం/,ఏప్రిల్ 23.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం సింగారం జిపిలో ఎంపీయుపియస్ పాఠశాలలో వార్షికోత్సవం సందర్భంగా ఆరో తరగతి విద్యార్థులు ఏడో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం గురువారం నిర్వహించారు. విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పిల్లలు నృత్యాలు చేసి అందరిని అలరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలోత్ శంకర్ ఆధ్వర్యంలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమత,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా, బాధవత్ లల్యా నాయక్,గుగులోత్ అనూష, గుగులోత్ భద్రు నాయక్, సపవత్ అనిత రాందాస్,స్కూల్ చైర్మన్ గుగులోత్ స్వరూప మహేష్, గ్రామ నాయకులు చెరుకుపల్లి రవి, గుగులోత్ అమర్సింగ్,మహేష్, బాలరాజు,సంతోష్,సురేష్,వంశీ, అనూష,సుధాకర్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.


# సింగారం జిపిలో దోమల నివారణకు చర్యలు.



**బయ్యారం/,ఏప్రిల్ 23.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం సింగారం గ్రామ పంచాయతీలో దోమల నివారణకు వైద్య అధికారి,సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామంలో అపారిశుద్ధ్యం అధిగమించేందుకు గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలలో ప్లాస్టిక్ సంచులు,బాటిల్స్ వేయవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్య కార్మికులకు సహకరించాలని,తడి,పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,ఉప సర్పంచ్ చుంచు మమత,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా,బాధవత్ లల్యా నాయక్, గుగులోత్ అనూష,గుగులోత్ బద్రు నాయక్, సపవట్ అనితా,స్కూల్ చైర్మన్ గుగులోత్ స్వరూప,గ్రామ నాయకులు చెరుకుపల్లి రవి, గూగులోత్ అమర్ సింగ్,మహేష్, సంతోష్,సురేష్,సుధాకర్,వంశీ గ్రామ పంచాయతీ సిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆశీస్సులు అందించిన కాంగ్రెస్ నాయకులు

**తల్లాడ, ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త)**



మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో జస్వంత్ పంచెకట్టు, నికిత ఓణీల వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మంచికంటి రామారావుస్పందన దంపతుల కుమారుడు జస్వంత్‌కు పంచెకట్టు, కుమార్తె నికితకు పుష్పాలంకరణ కార్యక్రమాలు స్థానిక శ్రీ మహాలక్ష్మి కళ్యాణమండపంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు మారెళ్ళ మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్ తదితరులు హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## యువత సంక్షేమానికి అన్వేష్ కృషి అనన్యం





**హనుమకొండ బ్యూరో /ఏప్రిల్ 24(జర్నలిస్ట్ వార్త):** యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి, వారిని సామాజిక సేవా పథంలో నడిపించడంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ చేసిన కృషి ఎనలేనిదని ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆకావరం శ్రీనివాస్ కుమార్ కొనియాడారు. పదోన్నతిపై స్టేట్ డైరెక్టర్‌గా వెళ్తున్న అన్వేష్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా యువజన సంఘాలు, అవార్డు గ్రహీతలు హనుమకొండలోని పల్లా భవన్‌లో ఘనంగా సన్మానించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత డా. ఆకులపల్లి మధు అధ్యక్షతన జరిగిన ఈ సభలో శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా జిల్లాలో యువజన సంఘాల బలోపేతానికి, యూత్ హాస్టల్ పునర్వైభవానికి అన్వేష్ ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. గ్రామీణ యువతకు విపత్తు నిర్వహణ, కంప్యూటర్ శిక్షణ వంటి అంశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ అన్వేష్ క్రమశిక్షణ, నిబద్ధత అందరికీ ఆదర్శమన్నారు. పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రమౌళి ఆయన వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా అన్వేష్, ఆయన సతీమణి డా. సౌమ్య దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఈసం నారాయణ, జెఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మస్యుద్దీన్, ప్రొఫెసర్ రాజకుమార్, దేవిలాల్, డా. సతీష్ చంద్ర, వసుధ, యువజన సంఘాల ప్రతినిధులు నవీన్ యాదవ్, సురేష్, పరశురాములు, శ్రీకాంత్, అజాం తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ వయసుతో ముడివడుతుంది



**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త)**మండలంలోని చింతలపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో దీర్ఘకాలంగా సేవలందించిన గడిల భీమయ్య, లలిత దంపతులకు పదవి విరమణ సందర్భంగా ఘన సన్మానం జరిగింది. 25 సంవత్సరాల పాటు విద్యార్థులకు బోధన అందించిన ఈ దంపతులను సర్పంచ్ బొంకూరి రజిత రవీందర్, పాఠశాల చైర్మన్ బలేరావ్ లావణ్య, హెడ్‌మాస్టర్ బత్తిని శ్రీదేవి శాలువాతో సత్కరించారు. అనంతరం సర్పంచ్ రూ.5,116 నగదును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భీమయ్య, లలితలు విద్యా రంగానికి చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవి విరమణ అనంతరం వారి జీవితం సుఖశాంతులతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వప్న, కారోబార్ రవీందర్ రావు, వార్డు సభ్యులు ఇరువాల రమాదేవి, వినోద్, హింగే అనిత, సుక్కినే నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మంచికి మారుపేరు ఎస్సై నరసింహారావు

### - ఘన వీడ్కోలు





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై ఈ. నరసింహారావుకు బదిలీ సందర్భంగా తోటి సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయన సేవలను ఘనంగా స్మరించుకున్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన నరసింహారావు అనేక క్లిష్ట కేసులను సమర్థవంతంగా ఛేదించి ప్రత్యేక గుర్తింపు పొందారు. పోలీస్‌గా కఠినతతో పాటు ప్రజల పట్ల మానవత్వంతో వ్యవహరించి మండల ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. అధికారుల విశ్వాసం, ప్రజల ప్రేమ రెండింటినీ సమానంగా సంపాదించిన మంచి అధికారి గా ఆయన పేరు నిలిచింది. బదిలీ ఉద్యోగ జీవితంలో సహజమైనదే అయినప్పటికీ, ఆయన చేసిన సేవలు మాత్రం చిరస్మరణీయమని సహచరులు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న నరసింహారావు అక్కడ కూడా ఇదే విధంగా ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తోటి ఉద్యోగులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## భూమి వారోత్సవాల్లో మొక్కలు నాటిన విద్యార్థులు

### పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యత వహించాలి దాసరి ప్రభాకర్ రెడ్డి

**సత్తుపల్లి/, ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):**



మండల పరిధిలోని బి.గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో భూమి వారోత్సవాల సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. క్యాంపస్ శుభ్రత, జీరో ప్లాస్టిక్ డ్రైవ్, వ్యర్థాల నిర్వహణ, సుస్థిరత ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ అనుబంధంతో, రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సహకారంతో ఏప్రిల్ 22 నుంచి 29 వరకు 'భారత్ సస్టైనబిలిటీ మిషన్2026' కింద భూమి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా. వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. పచ్చని, పరిశుభ్రమైన క్యాంపస్ నిర్మాణంలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు.

కార్యక్రమానికి హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ డా. బండి పార్థసారథి రెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. షేక్ మీరాసాహెబ్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థుల సత్తా

### సత్తుపల్లికి ఆల్ ఇండియా ర్యాంకులు



**సత్తుపల్లి,/ ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):**సత్తుపల్లి పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హెచ్. ఝాన్సీ శ్రీ (గ్రేడ్1) ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించగా, టి. దీక్షిత (గ్రేడ్1) 5వ ర్యాంక్, ఆర్. యోగిత లక్ష్మి 3వ ర్యాంక్, పి. శ్రీనిధి (8వ తరగతి) 4వ ర్యాంక్‌లను కైవసం చేసుకున్నారు. సీఎన్ఏపీఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎస్ఎస్ఓ, ఎన్‌టీఈఎక్స్ పరీక్షల్లో ఈ విద్యార్థులు క్యాంపస్ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు 1, 2, 3, 4 ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎన్ఏపీఎస్ ప్రతినిధులు, తెలంగాణ నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్ రెడ్డి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, గోల్డ్ మెడల్స్, బహుమతులు అందజేసి సన్మానించారు. ఆల్ ఇండియా ప్రథమ ర్యాంక్ సాధించిన హెచ్. ఝాన్సీ శ్రీకి ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జోన్ ఏజీఎం, ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేకే కమిటీ విధివిధానాలు అస్తవ్యస్తం

### ఉద్యమకారులకు న్యాయం జరగాలి: డా. కె.వి. కృష్ణారావు

**ఖమ్మం,/ ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):**



కేకే కమిటీ విధివిధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి. కృష్ణారావు విమర్శించారు. కొందరికి అనుకూలంగా, మరికొందరికి అన్యాయం జరిగే విధంగా కమిటీ పని తీరు ఉందని ఆయన ఆరోపించారు. ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్రటేరియట్ ముట్టడి ఫలితంగానే కేకే కమిటీ ఏర్పడిందని గుర్తుచేశారు. కమిటీకి స్పష్టమైన కాలపరిమితి, చట్టబద్ధత లేకపోవడం వల్ల అనిశ్చిత పరిస్థితి నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు. ఉద్యమకారులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి న్యాయం చేయాలని సూచించారు. ఏ కేటగిరీలో సకల జన సమ్మె ఉద్యమంలో పాల్గొన్న వికలాంగులు, ఉద్యమకారులు ఉండాలని, బీ కేటగిరీలో జైలు జీవితం అనుభవించిన వారు, కేసులు ఎదుర్కొన్న వారు ఉండాలని తెలిపారు. సీ కేటగిరీలో బైండోవర్ కేసులు, ఉద్యమ సంఘాల నాయకులు, ఫోటో, వీడియో ఆధారాల ఆధారంగా గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు కాకుండా, ప్రత్యక్షంగా ఉద్యమ నేతల అభిప్రాయాలు సేకరించి అర్హులైన వారిని గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారులకు ఐడీ కార్డులు, నెలకు రూ.25,000 పెన్షన్, ఇంటి నిర్మాణానికి 250 గజాల స్థలం, రూ.10 లక్షల ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు 5 శాతం రిజర్వేషన్ లేదా వారి కుటుంబాలకు రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు గుంతేటి వీరభద్రం, వైస్ చైర్మన్ బచ్చల పద్మాచారి, వర్కింగ్ చైర్మన్ బత్తినీ మధు గౌడ్, కోఆర్డినేటర్ కోడిరెక్క ఉమాశంకర్, కో చైర్మన్ లింగనబోయిన సతీష్, బాలిని భాస్కర్ రెడ్డి, బొబ్బిలి భరత్ చంద్ర, బురాన్, ఆసిఫ్, మోత్కురి వెంకటాచారి, గాజుల రవికుమార్, కామన అనంత లక్ష్మి, నల్ల స్వరూప రెడ్డి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు సత్యనారాయణ చిత్రపటానికి నివాళి

### - సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్




**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** సీనియర్ జర్నలిస్ట్, వార్తా దినపత్రిక హనుమకొండ జిల్లా ప్రతినిధి చెరుకు వేణుప్రసాద్ తండ్రి కీ.శే. డాక్టర్ చెరుకు సత్యనారాయణ దశదినకర్మ సందర్భంగా గురువారం వర్ధన్నపేటలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సత్యనారాయణ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, డీంబాయ్ టీవీ సీఈవో వేముల సదానందం నేత, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లాల వెంకటరమణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. జర్నలిస్టుల కుటుంబాలకు అండగా ఉంటామని నేతలు పేర్కొన్నారు. వేణుప్రసాద్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ పత్రికల జర్నలిస్టులు, బంధుమిత్రులు పాల్గొని దివంగత వైద్యుడి సేవలను గుర్తుచేసుకున్నారు.

## రేవంత్ సర్కారుకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

### కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారాలు ఆపాలి - మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డి క్యాబినెట్‌కు చెంపపెట్టు వంటిదని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ విమర్శించారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి, తెలంగాణలో పంటల దిగుబడిని పెంచిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన, ప్రభుత్వం కావాలనే నీరు నింపకుండా కుట్ర చేస్తోందని ఆరోపించారు. నీటిని నిల్వ చేయకుండా ఖాళీగా ఉంచడం ద్వారా ఇసుక మాఫియాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుభీమా, నాణ్యమైన విద్యుత్ అందించి సబ్బండ వర్గాలను ఆదుకున్నారని గుర్తుచేశారు. వేసవిలో సైతం చెరువులను నింపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మాజీ చైర్మన్ వనం రెడ్డి, కౌన్సిలర్లు గుజ్జ వీరన్న, తిరుపతి సురేష్, బానోత్ నవీన్, తుమ్మల శ్రీధర్, నాయకులు తుమ్మల రవీందర్, పూజారి రఘు, కొండేటి శ్రీనివాస్, సంపత్, రవీందర్, సారంగపాణి, వీరేష్, ముత్యాలు, సుభాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక
శుక్రవారం 24 ఏప్రిల్ 2026

# విద్యార్థుల పురోగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

**- పర్వతగిరి పీఎం శ్రీ గురుకుల ప్రిన్సిపాల్ పి. అపర్ణ**
**- ఘనంగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం**




**పర్వతగిరి/ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కేవలం పాఠశాల చదువులతోనే కాకుండా, తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందని పర్వతగిరి పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పి. అపర్ణ అన్నారు. ప్రజా పాలన , ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన పేరెంట్, టీచర్ సమావేశానికి సుమారు 300 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా పురోగతిని వివరిస్తూ వారి ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలో అందిస్తున్న అత్యాధునిక వసతులు, వ్యవసాయం, బ్యూటీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి రంగాల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో 8 బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ స్వాతి మాట్లాడుతూ సెలవుల్లో మైండ్‌స్పార్క్ కార్యక్రమం ద్వారా ఇంట్లోనే అభ్యాసం కొనసాగించాలని సూచించారు.వేసవి సెలవుల కోసం వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులకు అందజేస్తూనే, పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా చదువుపై శ్రద్ధ చూపేలా చూడాలని తల్లిదండ్రులు ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో భాగంగా నర్సరీ నిర్వాహకులు బక్కిరాజు, విజయ్‌లను సత్కరించారు. ఈ సభలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి. లావణ్య, వైస్ చైర్మన్ ఎం. స్వప్న, వేల్పుల కుమారస్వామి, కమిటీ సభ్యులు, కరుణాకర్ , కుమార్, మల్లికార్జున్,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.







# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం -వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**











**వర్ధన్నపేట/ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని, అందులో భాగంగానే రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చెన్నారం, రామోజీ కుమ్మరిగూడెం, ల్యాబార్తి, బండౌతాపురం, రామవరం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ డి.పి.ఎం దాసు, పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజ్ రెడ్డి, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అందుబాటులో ఉంటారని, ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతును రాజు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణాచారి, సీసీ అనిత, మండల సమైక్య అధ్యక్షురాలు ప్రమిల దేవి, సర్పంచులు సింధం లలిత, భూక్యా సుశీల, మీనా, ఉపసర్పంచులు గంగరాజు, తిరుపతి, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిదుముళ్ళ భాస్కర్, నాయకులు మల్లు నాయక్, బర్ల సహదేవ్, సతీష్, ప్రశాంత్ రెడ్డి, సోమ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## నల్లబెల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బడిబాట






**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని నల్లబెల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు కే. రాజు కోరారు. గురువారం పాఠశాల ఆవరణలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 2025-26 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజు మాట్లాడుతూ ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ విధిగా ఆరవ తరగతిలో చేరి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. రేపటి నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెలవుల్లో సరదాగా చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడకూడదని, ఇంట్లోనే ఉంటూ పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, పరిపూర్ణ చారి, రెహ్మత్, పుష్పనీల తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**ములుకనూరులో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**







**భీమదేవరపల్లి/ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే వరి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులకు ఆదేశించారు. భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుంచి ధాన్యం వస్తోంది, టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది, ధాన్యం నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత కార్యకలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వివరించారు. అనంతరం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీసీఎస్‌వో వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ తదితర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# స్వార్థపు ముసుగులో బంధాల వేలం.

## నేటి సామాజిక విలువల

నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు కేవలం అవసరాల మీదనే ఆధారపడి ఉన్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఒకప్పుడు మమతానురాగాలకు నిలయంగా ఉన్న కుటుంబ వ్యవస్థ, నేడు లెక్కల గదులుగా మారిపోతోంది. నిస్వార్థానికి మారుపేరుగా చెప్పుకునే తల్లిదండ్రుల ప్రేమ నుంచి, రక్తసంబంధీకుల అనురాగం వరకు ప్రతిదీ ఏమి ఆశించి? అనే ప్రశ్న దగ్గరే ఆగిపోతోంది. లోకంలో ప్రేమలన్నీ స్వార్థపూరితమే అన్న చేదు నిజం ప్రతి సామాన్యుడిని ఏదో ఒక సందర్భంలో వెక్కిరిస్తూనే ఉంది.

### డబ్బే పరమాత్మ.. ఆస్తే ప్రాణాధారం.

జీవితం సాఫీగా సాగాలన్నా, సమాజంలో గౌరవం దక్కాలన్నా నేడు కావలసింది సంస్కారం కాదు, కేవలం సంపద, మనిషి మంచితనాన్ని చూసి ఇచ్చే విలువ కంటే, అతని బ్యాంక్ బ్యాలెన్స్ చూసి ఇచ్చే విలువే అధికమైంది. సరిపడా డబ్బు, స్థిరాస్తులు ఉన్నంత కాలం చుట్టూ జనం, నీడలా వెంటాడే బంధువర్గం కనిపిస్తారు. కానీ, ఒక్కసారి ఆర్థిక పరిస్థితి దిగజారితే, కన్నవారు కూడా పరాయివారిలా చూసే దౌర్భాగ్య స్థితి నేడు దాపురించింది. నిస్సహాయ స్థితిలో ఉన్నవాడికి నీడ దొరకడం గగనమైపోతోంది. ప్రతి క్షణం ఒక నరకంలా అనిపించే పేదరికం, కేవలం ఆకలిని మాత్రమే కాదు, మనిషి ఆత్మగౌరవాన్ని కూడా చంపేస్తోంది.

### అందం. అవసరం. ఆపై అంతర్ధానం.

స్త్రీల విషయంలో సమాజం చూపే ధోరణి మరీ విచారకరం. అందం ఉన్నంత కాలం ఆకాశానికి ఎత్తేసే పొగడ్తలు, వయసు మళ్లినా లేదా అవసరం తీరినా ముఖం చాటేసే నైజం పెరిగిపోతోంది. మనుషులను మనుషులుగా కాకుండా, వస్తువులుగా చూసే దృక్పథం బలపడుతోంది. స్నేహం కూడా నేడు ఒక పెట్టుబడిగా మారింది. మన దగ్గర ఏదో ఒకటి ఆశించేవారు మాత్రమే స్నేహితులుగా మిగులుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు, ఆపదలో చేయి అందించే ఆప్తమిత్రులు కనుమరుగవుతున్నారు.

### మార్పు ఎక్కడ?

ప్రేమ అనే పదం వెనుక స్వార్థం దాగి ఉండటం సమాజ పతనానికి నిదర్శనం. రక్తం పంచుకు పుట్టిన వారే ఆస్తుల కోసం కోర్టుల మెట్లెక్కుతున్న రోజులివి. బంధాల కంటే బాండ్ పేపర్లకే విలువ పెరిగిన ఈ కాలంలో, నిజమైన అనురాగం వెతకడం ఎడారిలో మంచినీటి చుక్కను వెతకడమే. డబ్బు సంపాదించడం ముఖ్యం కావచ్చు, కానీ దాని కోసం బంధాలను బలిపెట్టడం మనిషి తన ఉనికిని తానే కోల్పోవడమే అవుతుంది.

### స్వార్థపు లోకం - మారుతున్న సంబంధాలు.

ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు పూర్తిగా వ్యాపార ధోరణిని సంతరించుకున్నాయి. ప్రేమ, ఆప్యాయత అనే పదాలు కేవలం నిఘంటువులకే పరిమితం అవుతున్నాయి. తల్లిదండ్రులు, తోబుట్టువులు, భర్త, పిల్లలు. ఇలా ప్రతి బంధం వెనుక ఏదో ఒక స్వార్థం దాగి ఉందన్నది కాదనలేని సత్యం. వ్యక్తిగత ప్రయోజనం లేనిదే నేడు ఎవరూ చిరునవ్వు కూడా చిందించడం లేదు.

ముఖ్యంగా ఆర్థిక అంశాలు కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. చేతిలో సంపద ఉన్న వ్యక్తికి సమాజం రెడ్ కార్పెట్ పరుస్తోంది. ఆస్తిపాస్తులు పుష్కలంగా ఉన్నంతకాలం జీవితం సాఫీగా సాగిపోతుంది. కానీ, ఒక్కసారి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైతే, నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడానికి అత్యంత ఆప్తులు కూడా ముందుకు రావడం లేదు. ఆ సమయంలో బ్రతుకు ఒక తీరని వేదనగా, ప్రతి క్షణం నరకప్రాయంగా మారుతోంది. ఆడవారి విషయంలో సమాజం చూపే వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. అందం ఉన్నంతవరకు కృత్రిమమైన పొగడ్తలతో ముంచెత్తి, అవసరం తీరగానే వదిలేసే సంస్కృతి పెచ్చురిల్లింది. స్నేహం అనే పవిత్ర బంధం కూడా ధనవంతులకే పరిమితం అవుతోంది. డబ్బు ఉన్నప్పుడు వెంట తిరిగే మనుషులు, కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం పలకరించడానికి కూడా ఇష్టపడటం లేదు. మొత్తం మీద లోకమంతా స్వార్థపు మయమైపోయిందని, మానవత్వం మంటగలుస్తోందని సామాజిక విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

# నేడు నర్సంపేటకు బండి సంజయ్ రాక

**నర్సంపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం నర్సంపేట పట్టణంలో పర్యటించనున్నారు. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన స్థానిక నేత శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. బాధిత కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పడంతో పాటు, ఈ ఘటనకు గల కారణాలను ఆయన అడిగి తెలుసుకోనున్నారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో బిజెపి శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ మేరకు బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. మధ్యాహ్నం నర్సంపేటకు చేరుకోనున్న మంత్రి, అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యే అవకాశం ఉంది. మంత్రి రాకను పురస్కరించుకుని పట్టణంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ పర్యటన స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

